


20న యువతకు ఉపన్యాస పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జాతీయ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్స్ కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్ లో ప్రసంగించే అవకాశం కోసం ఈనెల 20న ఆన్‌లైన్ వర్చువల్ మోడ్‌లో జరుగుతాయనినెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 18-25 సంవత్సరాల మధ్య వయసు గల యువతి యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆత్మనిర్భార్ భారత్ టు వికసిత్ భారత్ మేకింగ్ ఇండియా, ఎ గ్లోబల్ లీడర్ ఎంపోరింగ్ ది ఫ్యూచర్ అనే అంశాలపై ఉపన్యాస పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లాలో గెలుపొందిన విజేతలకు రాష్ట్రస్థాయి దేశస్థాయిలలో పోటీలు ఉంటాయని, దేశస్థాయిలో గెలిచిన విజేతలకు నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు. జిల్లాస్థాయి పోటీలు ఈనెల 20న ఉదయం 10 గంటలకు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాల కోసం చరవాణి 7036485273ను సంప్రదించాలని పేర్కొన్నారు.



నగరంలో వాహన ర్యాలీ నిర్వహిస్తున్న డ్రైవర్లు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై
రైతు, కార్మిక గర్జన

- విజయనగరంలో వాహన డ్రైవర్ల ర్యాలీ
- కలెక్టరేట్ వద్ద నిరసన
- పలుచోట్ల రాస్తారోకోలు, మానవహారాలు
- గ్రామీణ బంద్, సమ్మె జయప్రదం



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు, కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన గ్రామీణ భారత్ బంద్, కార్మిక సమ్మె జిల్లాలో విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా వాహన డ్రైవర్లు కోట జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఆయా సంఘాల అధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, సిఐటి యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు బి.శంకరరావు, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి గీత మాట్లాడారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ రైతులు, కార్మికులు, ప్రభుత్వ రంగాలను సర్వనాశనం చేయడమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకూ మద్దతు ధరల చట్టం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్మికులను రోడ్డు పాలు చేసి, హక్కులు హరించేలా నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ఉపాధిహామీకి కేంద్ర బడ్జెట్‌లో రూ.2లక్షల కోట్లు కేటాయించి, 200 రోజులకు,. వేతనం రూ.600కు పెంచాలని, 2 పూటల పని, ఆన్‌లైన్ మస్టర్ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠ పరచాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని, భూహక్కుల చట్టం 27/23ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

డ్రైవర్ల ను జైళ్లకు పంపే క్రిమినల్ చట్టాన్ని రద్దు చేయాలి

బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన భారత న్యాయ సంహిత క్రిమినల్ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని, రవాణా రంగ డ్రైవర్లకు, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సమ్మెలో ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వాహన డ్రైవర్లు కోట నుంచి కలెక్టరేట్‌కు భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి ఆ యూనియన్ జిల్లా కన్వీనర్ ఎ.జగన్ మోహన్ రావు, లారీ, లగేజ్ గూడ్స్ వెహికిల్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్.అక్బర్, టి.సత్తిబాబు మాట్లాడుతూ సరుకు, ప్రజా రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న డ్రైవర్లను క్రిమినల్స్‌ను చేయటం అత్యంత కిరాతకమైన చర్య అన్నారు. పెంచిన ఫీజులు, పెనాల్టీలు, రోడ్, టోల్ ,గ్రీన్ టాక్స్ రద్దు చేయాలని, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని, నిత్యవసర సరుకులను జిఎస్‌టి నుంచి మినహాయించి పెట్రోల్, డీజిల్ ను జిఎస్‌టి పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒకు వినతి అందజేశారు. ధర్నాల్లో సిఐటియు నాయకులు బి.రమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, వి.లక్ష్మి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి రాంబాబు, సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రంగరాజు, బాయి రమణమ్మ, ఇఫ్టూ నాయకులు కె.అప్పలసూరి , లగేజ్ గూడ్స్ వెహికల్స్ ,ఆటో యూనియన్ నాయకులు ఎ.శ్రీనివాస్, కరీం, ఎస్.రమణ, పి.భాస్కర్, డ్రైవర్లు పాల్గొన్నారు.



శృంగవరపుకోటలో మానవహారం నిర్వహిస్తున్న రైతులు, కార్మికులు, నాయకులు

వ్యవసాయ విశ్వ విద్యాలయం వద్ద కార్మికుల ధర్నా

వ్యవసాయాన్ని దెబ్బతీసే కేంద్ర ప్రభుత్వ విధానాలు మార్చు కోవాలని కోరుతూ విజయనగరం గాజులరేగలోని ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కార్మికులు సమ్మె చేసి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ఉపాధ్యక్షుడు రెడ్డి శంకర్రావు, మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం వ్యవసాయాన్ని దెబ్బతీసే విధంగా చట్టాలు తెచ్చి వ్యవసాయ విశ్వ విద్యాలయాలను అభివృద్ధి చేయకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇక్కడ పనిచేస్తున్న కార్మికులకు చట్టపరమైన హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిటు నాయకులు బి.రమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ, వ్యవసాయ విశ్వవిద్యాలయం వర్కర్స్ యూనియన్ నాయకులు బుజ్జమ్మ, కొండమ్మ, శ్రీను పాల్గొన్నారు.

రామభద్రపురం : మండల కేంద్రంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, నాయకులు బలసా శ్రీను, ఆటో యూనియన్ అధ్యక్షులు చొక్కాపు లోకేష్, ఉపాధ్యక్షులు సంజీవరావు, నాయకులు వెంకట్రావు, రామకృష్ణ పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దేవి బొమ్మ కూడలి వరకు సిఐటియు, ఎఐటియుసి, రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం మనవహారం నిర్వహించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు కామేశ్వరరావు, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, సిఐటియు జిల్లా నాయకులు చెలికాని ముత్యాలు, ఎఐటియుసి నాయకులు మద్ది కృష్ణ, నాయకులు స్వామి, మధు, ఎస్‌ఎఫ్ఐ నాయకులు ఎం.హర్ష తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : గ్రామీణ బంద్‌కు మద్దతుగా బొబ్బిలిలో పట్టణ కళాసీ సంఘం, సిఐటియు, ఎఐటియుసి, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కళాసీ సంఘం కార్యాలయం వద్ద ర్యాలీ ప్రారంభించి చర్చి సెంటర్, బజారు మీదుగా ఎన్‌టిఆర్ విగ్రహ కూడలి వరకు నిర్వహించి, అనంతరం మానవహారం చేశారు. కార్యక్రమంలో పట్టణ కళాసీ సంఘం కార్యదర్శి డి.వర్మ, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఎఐటియుసి జిల్లా నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కనకల పద్మనాభం ఆధ్వర్యాన స్థానిక మొయిద జంక్షన్ వద్ద రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో జె.సత్యారావు, ఎం.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : సిఐటియు, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొత్తవలస జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

గజపతినగరం : గ్రామీణ బంద్‌లో భాగంగా పలు సంఘాల ఆధ్వర్యాన స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి సూర్యమహల్ బ్రిడ్జి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్, వ్యకాస (బికెఎంయు) జిల్లా కార్యదర్శి పురంఅప్పారావు, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణవేణి, రైతు సంఘం నాయకులు దాసరి సింహాద్రి, సిఐటియు నాయకులు కృష్ణ, నూకరాజు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

బకాయిలు చెల్లించాలని ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం జలవనరులశాఖ విజయనగరం డివిజన్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ధర్నా చేశారు. ఎపి జెఎసి ఆధ్వర్యాన ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ డిమాండ్ల పరిష్కారం కోసం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి రమణ, జిల్లా నాయకులు సురేష్, బిహెచ్‌ఎస్‌ఆర్ ప్రభూజి, ఉపాధ్యక్షులు వై.ఆనంద్‌కుమార్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రాజు, అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, చంద్రశేఖర్, శ్రీధర్ బాబు, కనకరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని జెఎసి ఆధ్వర్యాన పిహెచ్‌సి ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో భోగాపురం తాలూకా అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు, అసోసియేషన్ అధ్యక్షులు జగదీశ్, ఉద్యోగ ప్రతినిధులు కె.గురుభక్తులు, కె.ఏసయ్య, సీతరాజు, వరలక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



కుళాయిని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వెల్లడించారు. శుక్రవారం 32,49 డివిజన్‌లోని నాయుడు కాలనీ, గాజుల రేగలోని ఎస్సీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కుళాయిలను ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ 700 మంది కుటుంబాలకు తాగునీరు అందించే ఏర్పాట్లు చేశామన్నారు. రూ.23లక్షలు వెచ్చించి వివిధ ప్రాంతాల్లో కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశామన్నారు. 15వేల కిలో లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంక్ నిర్మించిన తర్వాత మూడు డివిజన్లకు మంచినీటికి సమస్య లేకుండా కృషి చేశామన్నారు. ప్రజలు మరోసారి తనకు శాసనసభ్యునిగా అవకాశం ఇస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు ఎన్ని లక్ష్మణరావు, జోనల్ ఇన్చార్జిలు బొద్దాన అప్పారావు, మారం బాల బ్రహ్మారెడ్డి, రెడ్డి గురుమూర్తి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు నడిపిల్ల ఆదినారాయణ, నాయకులు కనుగులు రాజా తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు ప్రారంభం

వేణుగోపాలపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. 17 డివిజన్‌లో 25 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన కుళాయి కనక్షన్‌లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మేయరు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్, నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి ఇఇ దక్షిణామూర్తి, డిఇ అప్పారావు, నాయకులు ముద్దాడ మధు, ముచ్చు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలంతా ఇసుక, భూదందాలే

- కోలగట్ల గంజాయి అడ్డాగా మార్చేశారు
- జిల్లాలో ఒక్క హామీ కూడా నెరవేరలేదు
- అధికారంలోకి రాగానే తిన్నదంతా కక్కిస్తాం
- శంఖారావం సభల్లో లోకేష్



బహిరంగ సభకు హాజరైన జనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, విజయనగరం కోట, నెల్లిమర్ల, గంట్యాడ

విజయనగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు జిల్లాలో ఇసుక, భూ దందాలకు పాల్పడుతున్నారని, ఎదురు తిరిగిన ప్రజలపైనా, టిడిపి కార్యకర్తలపైనా అక్రమ కేసులు, ఆపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల మరో అడుగు ముందుకు వేసి భూదందాలతోపాటు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ అనంతబాబుతో చేతులు కలిపి విజయనగరాన్ని గంజాయికి అడ్డాగా మార్చేశారని విమర్శించారు. అధికారంలోకి రాగానే వైసిపి నాయులు దోచుకున్నదంతా కక్కిస్తానని, ప్రజలను, టిడిపి కార్యకర్తలను వేధింపులకు పాల్పడిన వైసిపి నాయకుల భరతం పడతానని హెచ్చరించారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని రామతీర్థం, విజయనగరం, గజపతినగరం నియోజకవర్గంలోని గంట్యాడలో శుక్రవారం నిర్వహించిన శంఖారావం సభల్లో ఆయన మాట్లాడారు. సిఎం జగన్ అధికారంలోకి రాక ముందు విజయనగరం జిల్లాకు 50 హామీలు ఇచ్చినా వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్, రామతీర్థసాగర్ ప్రాజెక్టు, పెద్దగెడ్డ పూర్తి, గోస్తాని - చంపావతి నదుల అనుసంధానం, స్వర్ణముఖి - చిట్టిగడ్డపై బ్రిడ్జి ఆచరణకు నోచుకోలేదన్నారు. టిడిపి ప్రభుత్వంలో విజయనగరం జిల్లాలో అత్యధికంగా రోడ్లు, భవనాలు, ఆసుపత్రు అభివృద్ధి, టూరిజం ప్రాజెక్టులు, సాగు-తాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిచ్చిందన్నారు.

సిఎం జగన్ అవినీతికేసులో కేసు ఏ2గా ఉన్న విజయసాయిరెడ్డి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజును అవమానిస్తూ, ఆయనకు చెందిన మాన్సాస్ ట్రస్టును లాగేసుకునేందుకు ప్రయత్నించారని అన్నారు. అధికారంలోకి రాగానే 'అశోక్ జగపతిరాజుతో పెట్టుకున్నానా అని భయపడేలా చేస్తాను అని లోకేష్ అన్నారు. ఎమ్మెల్యే వీరభద్రస్వామి అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా విజయనగరాన్ని మార్చారని అన్నారు. ప్రభుత్వ భూములు లాక్కుని పార్టీ కార్యాలయం కట్టుకున్నారన్నారు. ఎకరా రూ.15 లక్షలకు కొనుగోలు చేసి, ప్రజలకు ప్రభుత్వం తరపున ఇచ్చే సెంటు పట్టాల కోసం రూ.38 లక్షలకు విక్రయించిన ఘనత స్వామిదేనన్నారు. ఇటువంటి దందాలపై నిలదీసిన టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించి వేధింపులకు గురిచేస్తున్నాడని అన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే అప్పలనాయుడు, ఆయన కొడుకు మణిదీప్ నియోజకవర్గం లోని ఇసుక, ఇతర గనులను కాజేస్తున్నారని విమర్శించారు. పేద ప్రజల భూములు కూడా వారి పేర్లపై ట్రాన్స్ ఫర్ చేసుకుంటున్నారన్నారు. టిడిపి-జనసేన ప్రభుత్వం అధికారంలోకి గానే చింతపల్లిలో తలపెట్టిన జెట్టీని నిర్మిస్తామన్నారు. తారకరామతీర్థసాగర్, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మిస్తామని, మూతపడిన జూట్ మిల్లులను తెరిపిస్తామని, పెండింగ్‌లో ఉన్న టిడ్కో ఇళ్లను వంద రోజుల్లో పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని హామీ ఇచ్చారు.

విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున మాట్లాడుతూ విద్యార్థులకు పంపిణీ చేస్తున్న పుస్తకాలు, ఇతర వస్తు సామగ్రిలోనూ భారీ అవినీతి చోటు చేసుకుందని విమర్శించారు. గంట్యాడలో గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు మాట్లాడుతూ ఆధునీకరణ పేరుతో మూసివేసిన భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పనర్సయ్య దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో పేదలు, ప్రభుత్వానికి చెందిన సుమారు 500 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని అన్నారు. వాటిని కాపాడుకునేందుకు తాజాగా ఉత్తరాంధ్ర సులప్రవంతి కాలువ అలైన్‌మెంట్ కూడా ఇష్టారాజ్యంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. దీనివల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

నెల్లిమర్లలో నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ వైసిపి వైఖరివల్ల తామతీర్థసాగర్ ప్రాజెక్టు కలనెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు సాగునీరు లేక, మరోవైపు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక పొట్టకూటికోసం వలసలు పోవాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ఎయిర్‌పోర్టు, రామతీర్థసాగర్ నిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం, పునరావాసం పూర్తిస్థాయిలో అందలేదన్నారు.



వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరిస్తున్న లోకేష్

ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి : జనసేన

రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని జనసేన జిల్లా ఇన్‌ఛార్జి లోకం మాధవి, విజయనగరం, గజపతినగరం నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు పాలవలస శయస్విని, మర్రాపు సురేష్ అన్నారు. వైసిపి ప్రభుత్వ పెద్దలు పంచభూతాలను మింగేస్తూ అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. సభల్లో పలువురు టిడిపి, జనసేన నాయకులు

వినతులు వెల్లువ

నారా లోకేష్‌కు పలువురు తమ సమస్యలపై వినతులు ఇచ్చారు. పోలవరం ప్రధాన కాలువ ఎలైన్‌మెంట్ మార్పుతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దాన్ని రీ డిజైన్ చేయాలని ఉత్తరాంధ్ర సుజల స్రవంతి భూ బాధితులు కోరారు. పూర్తిస్థాయిలో డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసేలా చూడాలని డిఎస్‌సి అభ్యర్థులు వినతులిచ్చారు.

ఆయన్ని చూసి ఓటు వెయ్యాలట !

కోలగట్లపై అశోక్ వ్యంగ్యాస్త్రాలు



'విజయనగరంలో ఒక విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. అదేంటో నాకు ఇప్పటికీ అర్థం కాదు. వైసిపిని చూసి కాకుండా తనను చూసి ఓటేయాలని కోరుతున్నాడు ఇక్కడి ఎమ్మెల్యే' అంటూ కోలగట్ల వీరభద్రస్వామిపై టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు వ్యన్యాస్త్రాలు కురిపించారు. 'ఎమ్మెల్యే అంతరార్థం ఏమిటో నాకు అర్థం కాలేదు' అంటూ చురకలంటించారు. పరిస్థితి ఇలా ఉంటే ఊరినిండా ఫ్లెక్సీలు వేసుకోవడం ఎందుకని, ఏం అభివద్ధి చేశారని తిరిగి వైసిపికి ఓట్లు వేయాలని ప్రశ్నించారు. ఆడుదాం ఆంధ్రా అంటూ సిఎం జగన్ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుంటే.... స్థానిక ఎమ్మెల్యే జలాశనాలు వేసింది చాలదన్నట్టు నగరమంతా ఫెక్సీలతో నింపేశారని, అది ఎవరికి పనికొచ్చిన పని అని అన్నారు. దీన్నిబట్టి ఎమ్మెల్యేగానీ, ఆ పార్టీకి చెందిన మంత్రులు, పెద్దల ప్రాధాన్యతలు ప్రజలు గుర్తించాలన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ విద్యాశాఖ మంత్రి అయిన మొదటి సంవత్సరంలోనే రాష్ట్రంలో ఆరున్నర లక్షలమంది పిల్లలను బడికి దూరమయ్యారని అన్నారు. మరోసారి ఈ ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తే దేశంలోనే అత్యధిక నిరక్షరాస్యత ఉన్న రాష్ట్రంగా ఎపిని మారుస్తారని విమర్శించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతి మాట్లాడుతూ నగరాన్ని వైసిపి నాయకులు దోచుకుంటున్నారని అన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

ప్రజాశక్తి-విజయనగరంకోట



మాట్లాడుతున్న ట్రాఫిక్ సిఐ రంగనాథ్

మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సిఐ రంగనాథ్ అన్నారు. మైనరు డ్రైవింగ్‌పై శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. నగరంలోని ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ సిఐ రంగనాథ్ ఆధ్వర్యంలో ఎస్ఐలు లోవరాజు, సంబాన రవి, ఎ.ఎం.రాజు, త్రినాథ్, సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించి, వాహనాల డ్రైవింగ్ చేస్తున్న 17మంది మైనర్లను, వారి వాహనాలను అదుపులోకి తీసుకొని, ట్రాఫిక్ పోలీసు స్టేషనుకు తరలించారు. వాహనాల రికార్డులను పరిశీలించి, మైనర్లకు వాహనాలు ఇచ్చిన వాహన యజమానులను, వారి తల్లిదండ్రులను స్టేషనుకు పిలిచి, కౌన్సిలింగ్ నిర్వహించారు. వాహనాలకు సక్రమంగా రికార్డులు ఉన్నా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం నేరమని సిఐ అన్నారు. మరోసారి డ్రైవింగ్ చేస్తూ మైనర్లు పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన వాహన యజమానులు, తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి, ప్రమాదాలకు కారణమైతే అందుకు పూర్తి బాధ్యత వహనదారుడే వహించాల్సి ఉంటుందన్నారు. అనంతరం, ఎం.వి.నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు ఈ-చలానాలను విధించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు లోవరాజు, శంబాన రవి, ఎ.ఎం.రాజు, త్రినాథ్, పోలీసు సిబ్బంది, మైనర్ల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆటో మోటారు రంగం అభివృద్ధి చెందాలి

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-రామభద్రపురం

ఆటో మోటారు రంగం మరింత పురోభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. శుక్రవారం బూశాయివలస పంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ విజయదుర్గా టైర్స్ అండ్ వీల్ అలైన్మెంట్ వర్క్ షాపును స్థానిక ఎమ్మెల్యే శంబంగి చినప్పలనాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూరులో లారీ పరిశ్రమ పుంజుకోవాలంటే ఈలాంటి పరిశ్రమ ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని అన్నారు. గతంలో లారీలకు వీల్ ఎలైన్మెంట్ కోసం ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి విజయవాడ వెళ్లాల్సి వచ్చేదని,రామభద్రపురంలో ఈ పరిశ్రమను ఏర్పాటు చేసిన వ్యాపారులను అభినందించారు. కార్యక్రమంలో వ్యాపార భాగస్వాములు మండాది వేంకటగిరి, గ్రంధి శ్రీరామమూర్తి, గ్రంధి సతీష్ మండల జెసియస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు పత్తిగుళ్ళ ఏకనాథ్, నాయకులు కటికి చిన్నారావు,పువ్వుల నారాయణరావు, చింతల ఆనంద్, కనిమెరక అప్పారావు, తాత్రాజు రామకృష్ణ,, సాలూరు లారీ యజమానుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను మేనిఫెస్టోలో చేర్చాలి

ప్రజాశక్తి-బొబ్బిలి



బేబినాయనకు వినతి అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఒపిఎస్ పునరుద్ధరణను మేనిఫెస్టోలో చేర్చాలని యుటిఎఫ్ నాయకులు టిడిపి, జనసేన, కాంగ్రెస్ నాయకులకు శుక్రవారం వినతులు అందించారు. కోటలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయనను కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలైన సిపిఎస్, జిపిఎస్ రద్దు అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. విద్యారంగంలో తీవ్ర సంక్షోభానికి దారి తీసిన జిఒ 117ను రద్దు చేయాలని, మెరుగైన పిఆర్‌సిలు అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలనే అంశాలను అందులో పొందుపరచాలని విజ్ఞప్తిచేశారు.

18న సబ్ జూనియర్ కబడ్డీ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 21 నుండి 23 వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరగబోయే రాష్ట్రస్థాయి బాల, బాలికల సబ్ జూనియర్ కబడ్డీ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు జిల్లా బాల, బాలికల కబడ్డీ జట్లు ఎంపిక ఈనెల 18న మధ్యాహ్నం 2గంటలకు సిటీ క్లబ్ ఆవరణలో జరుగుతాయని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారావు దొర, కెవి ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.లక్ష్మణరావు తెలిపారు. క్రీడాకారులు 2008 మార్చి 18 తర్వాత పుట్టినవారై ఉండాలని, 55 కేజీల బరువు లోపు ఉండాలని తెలిపారు. ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఆత్మీయ సమావేశాలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట
ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేసినా అధిష్టానం నుంచి స్పందన లేకపోవడంతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తన గ్రూపుతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండలంలోని సంతగైరమ్మపేటలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సి వ్యూహాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గోగాడ కళావతి, ఎంపిటిసి కూనిరెడ్డి శ్రీదేవి, మాజీ సర్పంచులు కె.వెంకటరావు, పోతయ్య, నాయకులు గనివాడ రవిరాఘవరావు, గోగాడ అప్పారావు, శ్రీనివాసరావు, దేముడు, ఈశ్వరరావు, కృష్ణంనాయుడు, సతీష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు

ప్రజాశక్తి-మెరకముడిదాం
బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక అనర్థాలు సంభవించే అవకాశం ఉందని కళాజాతా బృందం అవగాహన కల్పించింది. మండలంలో గర్భాంలో ఐసిడిఎస్ ఆధ్వర్యాన కళాజాతా బృందం ప్రదర్శనను శుక్రవారం నిర్వహించారు. బుర్రకథ రూపంలో బాల్యవివాహాలపై నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజరు తాడ్డి శ్రీదేవి, జె.లక్ష్మి, ఎం.నాగమణి పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ గ్రామసభ

ప్రజాశక్తి-వేపాడ


మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటరావు


మండలంలోని సింగరాయి గ్రామంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. చేసిన పనుల వివరాలు, పనులకు చెల్లించిన నిధులు, చేసిన వేతనదారులకు సంబంధించిన రికార్డులను తనిఖీ సిబ్బంది పరిశీలించింది. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.వెంకటరావు, ఎంపిటిసి రాజేష్, పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఫేర్‌వెల్ సంబరాలు

ప్రజాశక్తి-వేపాడ
గురుకులంలో ఫేర్‌వెల్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న పదో తరగతి, సీనియర్ ఇంటర్ విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్ టిఎం ఫ్లోరెన్స్ మాట్లాడుతూ బాగా పరీక్షలు రాసి, బంగారు భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని కోరారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

రేవతికి ఘన సన్మానం

ప్రజాశక్తి-శృంగవరపుకోట


రేవతికి జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

గ్రూప్-2 పరీక్షలో ఎంపికై సాధించి ఆర్‌డబ్ల్యుఎస్‌లో ఎఇఇగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో నియమితులైన ఎం.రేవతిని పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సన్మానించారు. సన్మాన గ్రహీత రేవతి మాట్లాడుతూ తన ఉద్యోగ సాధనలో గ్రంథాలయం ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుధారాజు, గ్రామ సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, వార్డ్ మెంబర్ ఆడారి సూరిబాబు, మోపాడ శ్రీను, గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ పాల్గొన్నారు.

టిడిపిలో భారీగా చేరికలు

ప్రజాశక్తి- విజయనగరం కోట
విజయనగరం మండలం బడుకొండపేటకు చెందిన వైసిపి నాయకులు పాశి అప్పలనాయుడు, డొప్ప అప్పలనాయుడు, దువ్వ గురుమూర్తి, బడుకొండ చిన్న సత్యం తదితర వంద కుటుంబాలు టిడిపిలో చేరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో పోలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు , నియోజకవర్గ ఇంఛార్జి పూసపాటి అదితి విజయలక్ష్మి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ , మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ


స్థల పరిశీలన చేస్తున్న ఎంఇఒ బాలభాస్కరరావు

మండలంలోని కరకవలస, ఆతవ పాఠశాలలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సౌకర్యాలను, రికార్డులను పరిశీలించారు. కరకవలస పాఠశాలకు మరుగుదొడ్లు మంజూరు చేయడంతో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో కలిసి స్థల పరిశీలన చేశారు.

వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ


ప్రజాశక్తి-రేగిడి
స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపిస్ట్ రామ్ భరద్వాజ్ ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ ప్రక్రియను ఎంఇఒలు ఎం.వరప్రసాదరావు, వై.ఎరకయ్య పరిశీలించారు. సాహిత్య విద్య ఉపాధ్యాయులు మహేశ్వరి, టి.రాజేష్, సిజివిఐ అనురాధ పాల్గొన్నారు..

రేపు 'అభ్యుదయ'లో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బొబ్బిలి
స్థానిక అభ్యుదయ పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ మర్రాపు కూర్మినాయుడు, ప్రిన్సిపల్ చింతా శారద ఒక ప్రకటనలో తెలిపారు. గౌడవీధి క్యాంపస్‌లో ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని చెప్పారు. కంటి శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయిస్తామని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆరోగ్యశ్రీ కార్డు తీసుకురావాలని కోరారు.

వేడుకగా పైడితల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గజపతినగరం


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

గజపతినగరంలో పైడితల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆలయ ధర్మకర్త కందుల వెంకట చిన్నయ్య స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అమ్మవారిని దర్శించేందుకు యాత్రికులు పోటెత్తారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. ధర్మకర్త చిన్నయ్య స్వామి, ఉప సర్పంచ్ కర్రి రామినాయుడు, కర్రి నానాజీ ముందుగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుమారు పదివేల మందికి అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు.

గుండాలమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ
మండలంలో జాకేరు గ్రామంలో గుండాలమ్మ జాతర శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ నాయకులు అప్పలనాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. గుండాలమ్మ ఆలయాన్ని దర్శించుకునేందుకు జనం భారీగా తరలించారు. జాతర సందర్భంగా భారీగా సాంస్కృతిక కార్యక్రమాలు, శనివారం గుర్రపు పోటీలు, ఆదివారం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహిస్తున్నారు.

గ్రామీణ భారత్ బంద్ దృశ్యమాలిక



బొబ్బిలిలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు, కళాసీలు, నాయకులు


గజపతినగరంలో రాస్తారోకో చేస్తున్న రైతులు, కార్మికులు, నాయకులు






రామభద్రపురం, కొత్తవలస, నెల్లిమర్లలో రాస్తారోకోలు నిర్వహిస్తున్న పలు సంఘాల నాయకులు ,రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు

విద్య, ఉపాధి కల్పనే లక్ష్యం

- రైతులకు అండగా నిలుస్తా
- టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ



'విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుంది. ఉద్యోగావకాశాల కల్పనతోనే ఏ కుటుంబం అయినా బాగుపడుతుంది. అందుకే విద్య, ఉపాధి అవకాశాలపై ప్రధానంగా దృష్టిసారిస్తాను. నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య పట్టిపీడిస్తోంది. దీంతో సగటు కుటుంబానికి సరైన తిండి, బట్ట, గూడు వంటివి కూడా కరువయ్యాయి. వీటిని అధిగమించాలంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. దీన్ని దృష్టిలో పెట్టుకుని శృంగవరపుకోటలో నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ కోర్సులు ప్రారంభించాం. మరోవైపు నియోజకవర్గంలో రైతుల సమస్యల కేంద్రంగా పనిచేసి, వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటాను' అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ తెలిపారు. ఎన్ఆర్ఐగా అనేక సేవలందించి, రాజకీయాల్లోకి ప్రవేశించాక చురుగ్గా కార్యక్రమాలు చేపడుతున్న గొంప క్రిష్ణ... 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

- ప్రజాశక్తి, వేపాడ

చిట్ చాట్

కుటుంబ నేపథ్యం.?

శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని వేపాడ మండలంలోని అంకాజోష్యులపాలెం నా స్వగ్రామం. గొంప సూర్యనారాయణ, అప్పలనరసమ్మ తల్లిదండ్రులు. నా భార్య రమాదేవి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. మాకున్న రెండు ఎకరాల భూమిని సాగు చేయడానికి నీరు లేక కూలీ నాలీ చేసుకునే నా తల్లిదండ్రులు కుటుంబాన్ని నెట్టుకొచ్చి, చదివించారు. చదువు విలువ తెలుసుకుని, కష్టబడి చదవడంతో దేశ, విదేశాల్లో ఉన్నత కొలువులు లభించాయి. 2006లో బెంగళూరులోని ఐబిఎం సాఫ్ట్‌వేర్ కంపెనీ, 2009లో మలేషియాలోని సైబర్ జయ కంపెనీలో, 2011లో థాయ్‌లాండ్‌లోని ఎస్‌ఎపి కంపెనీలో పనిచేశాను. 2012 నుంచి అమెరికాలోని వివిధ వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో విధులు నిర్వర్తించాను.

రాజకీయాల్లోకి రావడానికి కారణమేమిటి.?

నారా చంద్రబాబునాయుడు సిఎంగా ఉన్నప్పుడు రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఎన్ఆర్‌లకు పిలుపునిచ్చారు. దీంతో అమెరికాలో జన్మభూమి అనే నాన్ ప్రాఫిట్ సంస్థ ఏర్పాటు చేసి తద్వారా ఎపిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహకారం అందించాం. జన్మభూమి విజయనగరం జిల్లా కమిటీ కో-ఆర్డినేటర్‌గా పని చేశాను. ఆ సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాం. అనంతర పరిణామాల నేపథ్యంలో 2022లో అధినేత చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశాను. మేము చేపట్టిన కార్యక్రమాలపై చర్చ జరుగుతుండగానే ఎస్.కోట ప్రాంతంలో పార్టీ తరపున పనిచేయాలని నాకు సూచించారు. పెద్దాయన మాటను శిరోధార్యంగా భావించి సొంత నిధులతోనే పార్టీ తరపున సేవా కార్యక్రమాలు మొదలెట్టాను. ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను.

వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే ఏ విధంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తారు.?

భావితరాలు బాగుపడాలంటే చదువే ముఖ్యం. దాంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కలగాలి. అదే లక్ష్యంతో ఇప్పటి నుంచే నిరంతరం పనిచేయడం ప్రారంభించాను. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్నీ సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నాను. గిరిజన ప్రాంతంలో విద్య, వైద్యం, తాగునీటి సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వీటిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తాను. వీటితోపాటు ఎస్.కోట పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ ఏర్పాటుకు కృషి చేస్తాను. రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను.

నియోజకవర్గంలో చేపట్టిన సేవా కార్యక్రమాలు ఏమిటి.?

అమెరికాలో ఉద్యోగం చేస్తుండగానే, తానా ఆధ్వర్యాన జన్మభూమి ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యాను. పదేళ్లుగా ఉత్తరాంధ్రలో సేవా కార్యక్రమాలు చేపట్టాం. ఎస్.కోట నియోజకవర్గంలోని అన్ని స్కూళ్లను శక్తిమేర అభివృద్ధి చేసేందుకు పాటుపడ్డాను. వేలాది మంది పేద రైతులకు సేఫ్టీ కిట్లు, స్ప్రేయింగ్ మిషన్లు పంపిణీ చేశాను. గొంప క్రిష్ణ విద్యాసంకల్పం పేరుతో విద్యార్థులకు, యువతకు సహకారం అందిస్తున్నాను. నియోజకవర్గంలోని టెన్త్, ఇంటర్ విద్యార్థులందరికీ స్టడీమెటీరియల్, ఇతర సామగ్రి అందజేశాం. కష్టకాలంలో ఉన్న వారికి అండగా నిలిచాను. విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవసరమైన ఉచితంగా స్కిల్ డెవలప్మెంట్ బుక్స్ పంపిణీ, నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాల కోసం శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నాను.

యువతకు మీరిచ్చే సందేశం ఏమిటి.?

క్రమశిక్షణతో చదివి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తేవాలి. చదువుకు పేదరికం అడ్డుకారాదు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలం. మరోవైపు అభివృద్ధి చేసే వారికి యువత ఓటేయాలి. భావితరాలకు మంచి భవిష్యత్తు ఇచ్చే వారిని ఎన్నుకోవాలి. అప్పుడే మంచి సమాజం సాధ్యమవుతుంది.

నియోజకవర్గంలో సమస్యలపై దృష్టి పెట్టారా? మీ దృష్టికి వచ్చిన సమస్యలు ఏమిటి.?

నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. సాగునీరు పూర్తిస్థాయిలో అందక పంటలు పండటం లేదు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత తాటిపూడి, రైవాడ రిజర్వాయర్ల నుంచి నీరందించేందుకు కృషి చేస్తాను. కెజిపూడి, విజయ రామసాగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తే వేలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. గిరిజన గ్రామాలకు రోడ్లు లేవు. రోడ్డు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉంది. నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేస్తాను.

వాలంటీర్లతోనే ప్రభుత్వానికి మంచిపేరు

ఎమ్‌పి బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ


వాలంటీర్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్‌పి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-డెంకాడ
వాలంటీర్లు అందిస్తున్న సేవల వల్లే ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో వాలంటీర్ల సేవలకు వందనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని, వాటిని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు. మండలంలో సుమారు 300 మంది వాలంటీర్లలకు సేవా పురస్కారాలు అందించి, సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్ ఎంపిపిలు పిన్నింటి తమ్ముునాయుడు, అనిత, ఎంపిడిఒ ఎ.లవరాజు, తహశీల్దార్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-భోగాపురం
మండలంలోని రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు విజయనగరం రూరల్ ఇఇ జి.సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ముక్కాం, సవరవల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో 33/11 కెవి లైన్‌లో నిర్వహణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. సవరవల్లి, ఎ.రావివలస, గూడెపువలస, దల్లిపేట, బైరెడ్డిపాలెం, రెడ్డికంచేరు, రావాడ, తూడెం, కవులవాడ, సన్‌రే రిసార్ట్, అమటాం, ముంజేరు, నందిగాం, రామచంద్ర పేట, మిరాకిల్ కళాశాల పరిధిలో విద్యుత్తు నిలుపుదల ఉంటుందని చెప్పారు. అందుకు ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-డెంకాడ
బోగాపురం మండలంలోని బైపురెడ్డిపాలెం గ్రామానికి చెందిన సిరపు దుర్గారెడ్డి కిడ్నీవ్యాధితో బాధపడుతున్నాడు. ఆయనకు శుక్రవారం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దుకు 18న చలో విజయవాడ

విజయనగరం టౌన్ : సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న చలో విజయవాడ కార్యక్రమానికి ఉద్యోగులంతా తరలి రావాలని ఎపి సిపిఎస్ఇఎ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం చలో విజయవాడ వాల్ పోస్టర్‌ను వివిధ మండలాలలో ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీరాములు, నాయకులు సత్యనారాయణ, భాస్కర రావు, చందు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కౌన్సిలర్‌గా జెసి రాజు

ప్రజాశక్తి-బొబ్బిలి



ఎపిటిఎఫ్ అకడమిక్ కౌన్సిలర్‌గా, జిల్లా ఆహ్వానితులుగా జెసి రాజును నియమితులయ్యారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి మరింత బాధ్యతగా పని చేస్తానని జెసి రాజు చెప్పారు.

అప్సా అల్లూరి జిల్లా అధ్యక్షులుగా వెంకటరాము

ప్రజాశక్తి-శృంగవరపుకోట
ఎపి ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులుగా శ్రీగౌరీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ కాండ్రేగుల వెంకటరాము ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల అధ్యాపక బృందం వెంకటరామును అభినందించి, సత్కరించింది.

పది బోర్లు ప్రారంభం

ప్రజాశక్తి-భోగాపురం


బోరును ప్రారంభిస్తున్న ఉప్పాడ సూర్యనారాయణ


భోగాపురం మేజర్ పంచాయతీలో మండల పరిషత్ నిధులతో వేసిన బోర్లను వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్య నారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఎంపిటిసిలకు ఇచ్చిన మండల పరిషత్ నిధుల నుంచి ఒక్కో బోరు రూ.1.10 లక్షలతో.. మొత్తం 10 బోర్లు ఏర్పాటుచేశారు. జాతీయ రహదారిపై చాకివలస వెళ్లే జంక్షన్ వద్ద బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసి కొయ్య సంతోషి, నాయకులు పడాల శ్రీనివాసరావు, సుందర హరిష్, ఊడికల గురువులు పాల్గొన్నారు.

రోగికి సిరి సహస్ర సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
సాలూరు మండలం మెట్టవలసకు చెందిన నిమ్మక సురేష్ గుండె సంబంధిత సమస్యపై బాధపడుతూ సాయం కోసం మజ్జి సిరి సహస్రను ఆశ్రయించారు. ఆమె స్పందించి అతనికి తక్షణ మందుల ఖర్చుల నిమిత్తం రూ 5వేలు ఆర్థిక సహాయం చేశారు.

ఉంగరాడలో చోరీ

ప్రజాశక్తి-రేగిడి


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి మోహన్‌రావు

మండలం లోని ఉంగరాడ గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో బోటు నాగరాజుకు చెందిన 1.5 తులాల బంగారం, రూ.30 వేలు నగదు చోరీకి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. డిఎస్‌పి మోహన్ రావు, సిఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-భోగాపురం
మద్యం సీసాలను తీసుకెళ్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు సిఐ రవికుమార్ తెలిపారు. రావాడ గ్రామానికి చెందిన బుత్తల పైడిరాజు శుక్రవారం 14 సీసాలను తరలిస్తుండగా జాతీయ రహదారిపై అవనాం జంక్షన్ వద్ద పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

మిమ్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-నెల్లిమర్ల


శిబిరంలో మాట్లాడుతున్న అంబళ్ల శ్రీరాములు నాయుడు

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ళ శ్రీరాములు నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు 15 రోజులుగా చేస్తున్న నిరసన శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం ఉద్యోగులు, కార్మికులకు డిఎ బకాయిలు, వేతనఒప్పందం చేయకుండా అడిగిన వారిని సస్పెండ్ చేయడం తగదన్నారు. ఇరువర్గాలు చర్చలు జరిపి న్యాయమైన సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత మిమ్స్ యాజమాన్యంపై ఉందన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పోరాటానికి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. దీనిలో భాగంగా ఆయన రూ.10వేల రూపాయలు పోరాట నిధి అందజేశారు. కార్యక్రమం లో వైసిపి నాయకులు సారిపల్లి గుర్నాధరావు, మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ, ఉద్యోగులు ఎం.నారాయణ, కె. కాము నాయుడు, ఎం. నాగ భూషణం, మూర్తి, రాంబాబు, మధు, గౌరి, వర లక్ష్మి, రామ కష్ణ, బంగారునాయుడు పాల్గొన్నారు.

త్వరలో బూత్ కమిటీల నియామకం

ప్రజాశక్తి-చీపురుపల్లి
త్వరలో బూత్ కమిటీల నియామకాన్ని చేపట్టనున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు బెల్లాన వంశీకృష్ణలు తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో 60 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ఒక్కో బూత్‌కి నలుగురు సభ్యులను నియమిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికలలో సమర్థవంతంగా ముందుకు సాగేందుకు బూత్ కమిటీలను ఏర్పాటు చేయనున్నామన్నారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ దన్నాన జనార్దన్, జెసిఎస్ మండల కన్వీనర్ సువ్వాడ అప్పలనాయుడు, రామలింగాపురం సొసైటీ మాజీ అధ్యక్షుడు బెల్లాన త్రినాథ్, కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద్ పాల్గొన్నారు.

రామతీర్థంలో కల్యాణ ఉత్సవాల పందిరిరాట

ప్రజాశక్తి-నెల్లిమర్ల
రామతీర్థం దేవస్థానంలో కల్యాణ ఉత్సవాల పందిరి రాట కార్యక్రమాన్ని శుక్రవారం రథసప్తమి సందర్భంగా వైభవంగా నిర్వహించారు. 20న కళ్యాణోత్సవం, 23న రథయాత్ర నిర్వహించనున్నారు. కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వై.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.


నారాయణరావును అభినందిస్తున్న లోకేష్

నారాయణరావుకు లోకేష్ అభినందన

ప్రజాశక్తి-గుర్ల
టిడిపి సోషల్ మీడియాలో చురుగ్గా పనిచేసిన ఐటిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగులపల్లి నారాయణరావును ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ అభినందించారు. చీపురుపల్లిలో జరిగిన సమావేశం అనంతరం ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. టిడిపి గెలుపే లక్ష్యంగా సోషల్ మీడియా సభ్యులంతా పనిచేయాలని కోరారు. నారాయణరావును లోకేష్ అభినందించడంతో బిసి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వెన్నె సన్యాసినాయుడు, టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.